
# కంగనా రనౌత్ చెంపదెబ్బ ఘటనపై స్పందించిన బాలీవుడ్ సీనియర్ నటి





బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు చండీగఢ్ విమానాశ్రయంలో చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో ఓ సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కంగనాపై చేయి చేసుకుంది. దీంతో ఈ ఘటన సోషల్ మీడియాలో కలకలం సృష్టించింది. ఇక ఈ ఘటనపై కొందరూ సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చేసిన పని సరైనది అని మద్దతుగా నిలుస్తుండగా మరికొందరు కంగనాకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ ఘటనపై బాలీవుడ్ సీనియర్ నటి షబానా అజ్మి స్పందించింది.నాకు కంగనా పట్ల ప్రేమ లేదు కానీ.. ఈ చెంప దెబ్బకి ఆనందించే వాళ్ళతో నేను కలవలేను. ఇలా భద్రత సిబ్బంది చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే మనం ఎవరం కూడా సేఫ్‌గా ఉండలేము. దీనిపై ఆలోచించాలి. అంటూ రాసుకోచ్చింది.అసలు ఏం జరిగిందంటే.. పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన కంగనా రనౌత్ చండీగఢ్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడ సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ ఆమెను చెంప చెళ్లుమనిపించింది. వంద రూపాయలకే రైతులు ధర్నాలో పాల్గొంటారంటూ గతంలో కంగనా చేసిన విమర్శల నేపథ్యంలో దాడి చేశానని సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెప్పింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన ధర్నాలో తన తల్లి పాల్గొన్నదని, నిరసన తెలుపుతున్న ఆమెపై అలా మాట్లాడటం తట్టుకోలేకనే కంగనా చెంప పగలగొట్టానని తెలిపింది. కాగా, ఈ చర్యను తీవ్రంగా పరిగణించిన సీఐఎస్ఎఫ్.. కుల్విందర్‌ను సస్పెండ్ చేసింది. ఆమెపై కేసు కూడా నమోదు చేసి అరెస్టు చేశారు.

# రామోజీ రావు మృతిపట్ల సంతాపం ప్రకటించిన 'గేమ్ ఛేంజర్' టీమ్



ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు(88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. ఇక రామోజీరావు మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులతో పాటు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. తాజాగా రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ టీమ్ కూడా సంతాపం ప్రకటించింది. రాజమండ్రిలో గేమ్ ఛేంజర్ దర్శకుడు శంకర్, నటుడు రామ్ చరణ్ సునీల్, తదితరులు రామోజీ రావుకు నివాళు లర్పిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఒక వీడియో కూడా విడుదల చేసింది.రాజమండ్రిలో శంకర్ రామ్ చరణ్ రామోజీ రావుకు నివాళులర్పిస్తూ మౌనం

# అతనే పర్‌ఫెక్ట్‌మ్యాన్ !

ఈ ఏడాది మార్చిలో చిరకాల స్నేహితుడు మాథిస్‌బోను పెళ్లాడింది పంజాబీ భామ తాప్సీ. కొద్దిమంది కుటుంబ సన్నిహితుల సమక్షంలో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వారి వివాహం జరిగింది. తన పెళ్లి గురించి ఇప్పటివరకు ఎలాంటి విశేషాలను పంచుకోలేదు తాప్సీ. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహంతో పాటు తన భర్త మాథిస్‌బో గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. కాలేజీ రోజుల నుంచి తాను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశానని, అయితే మాథిస్‌బోలో తాను పర్‌ఫెక్ట్‌మ్యాన్‌ను చూశానని తాప్సీ పేర్కొంది. 'మాది ఒక్కరోజులో చిగురించిన ప్రేమకాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. మాథిస్‌తో చేసిన ప్రయాణంలో నేను చాలా సెక్యూర్డ్‌గా ఫీలయ్యాను. అతను బ్యాడ్మింటన్ ప్లేయర్ కాబట్టి ఎప్పుడూ పాజిటివ్ ధృక్పథంతో కనిపించేవాడు. సవాళ్లను స్వీకరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే మనస్తత్వం అతనిది. ఈ లక్షణాలు నచ్చే అతన్ని పెళ్లాడాను' అని తాప్సీ చెప్పుకొచ్చింది. భిన్న దేశాలకు చెందిన



ఇద్దరి మధ్య సాంస్కృతికంగా భేదాలు ఉన్నప్పటికీ..మాథిస్‌కు భారతీయ సంప్రదాయాలపై మంచి అవగాహన ఉందని తాప్సీ పేర్కొంది.

# తండేల్ ప్రేమ ముచ్చట్లు

బతుకుతెరువుకోసం సముద్రం పైకెళ్లి శత్రుదేశానికి చిక్కిన ఓ భర్త పోరాటం. పెనిమిటిని దక్కించుకోటానికి నిండుచూలాలైన భార్య సొంత దేశంలో పడే ఆరాటం.. వెరసి 'తండేల్'. ఆర్ధ్రతతో నిండిన ఈ పరిపూర్ణప్రేమకథకు నాగచైతన్య, సాయిపల్లవి నాయకా, నాయికలు. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రంపై ప్రారంభం నుంచి అంచనాలు అంబర స్థాయిలోనే ఉన్నాయి. ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే చాలా వరకూ పూర్తయింది. తాజా షెడ్యూల్ హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ నెల 10 నుంచి మొదలుకానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో నాగచైతన్య, సాయిపల్లవిలపై ప్రేమ సన్నివేశాలను చిత్రీకరించనున్నారట దర్శకుడు చందు మొండేటి. నాగచైతన్య ఇందులో మత్స్యకారుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న యథార్థగాథ ఇదని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు. ఈ చిత్రానికి



కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్.

# ధనుష్ స్వీయ సినిమా రాయన్



తమిళ నటుడు ధనుష్ ప్రస్తుతం వరుస సినిమాలతో లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే ఈ ఏడాది సంక్రాంతికి 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్న ఈ హీరో ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు. ఇక ఈ సినిమా అనంతరం ధనుష్ తన 50వ సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పేరు రాయన్. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ లుక్ వైరల్ అయ్యింది. ఇక ఇదే సినిమాలో సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రబృందం పీచు మిఠాయి అంటూ రొమాంటిక్ పాటను విడుదల చేసింది. ఇక ఈ పాటలో సందీప్ కిషన్, అపర్ణ బాలమురళి రోమాన్స్ ఆకట్టుకునేలా ఉంది. విజయ్ ప్రకాష్, హరిప్రియ కలిసి పాడిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, ఎఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# దర్శకుడు విజయభాస్కర్ రంగప్రవేశం

### కొడుకు శ్రీకమల్ హీరోగా ఉషాపరిణయం మూవీ

టాలీవుడ్ సీనియర్ దర్శకుడు కే. విజయ్ భాస్కర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'జై చిరంజీవ' లాంటి ఆల్‌టైమ్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్‌లను టాలీవుడ్‌కు అందించాడు. ఇక చాలారోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న విజయ్ భాస్కర్ తన కొడుకు కోసం మళ్ళీ మెగాఫోన్ పట్టాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఉషాపరిణయం' లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాలో విజయ్ భాస్కర్ కొడుకు శ్రీకమల్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే మూవీకి సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్ వదిలింది. ఇక ఈ టీజర్ గమనిస్తే.. విజయ్ భాస్కర్ చాలా ఏండ్ల తర్వాత మళ్లీ ఓ సరికొత్త ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నట్లు తెలుస్తుంది.

# ఉషాకిరణ్‌తో సినీరంగ ప్రవేశం

### - దాదాపు 87 చిత్రాల నిర్మాణం - ఎందరో కొత్తవారికి తెర పరిచయం

పాత్రికేయంతో తెలుగు ప్రజలపై చెరగని ముద్ర వేసిన రామోజీ రావు.. సినీరంగంలోనూ ఎన్నో అద్భుతాలు సృష్టించారు. ఉషా కిరణ్ మూవీస్ సంస్థను స్థాపించి, వివిధ భాషల్లో 87 చిత్రాలను నిర్మించి ఎంతోమంది కొత్త నటీనటులను రంగుల పరిశ్రమకు పరిచయం చేశారు. సమున్నత పాత్రికేయ విలువలకు పట్టంగట్టే ఈనాడుకు అనుబంధంగా ప్రారంభమైనదే 'సితార' సినిమా వారపత్రిక. రంగుల లోకంలోని విశేషాలను సమగ్రంగా అందించేలా దాన్ని ప్రారంభించారు. 1976లో ఇది పాఠకుల ముంగిటకు వచ్చింది. కేవలం వార్తలు, కథనాలను అందించేందుకు పరిమితం కాకుండా విలువలున్న చిత్రాల్ని ప్రోత్సహించే దిశగానూ రామోజీ ఆలోచన చేశారు. ఆరోగ్యకరమైన వినోదాన్ని ప్రేక్షకులకు అందించాలనే సదుద్దేశంలో 1983లో రామోజీరావు ఉషాకిరణ్ మూవీస్‌ను ప్రారంభించారు. ఉషాకిరణ్ మూవీస్‌పై నిర్మించిన తొలి సినిమానే సూపర్ హిట్‌గా నిలిచింది. 'ప్రేమలేఖ' నవలను చిత్రంగా మలచాలని భావించారు. ఆ కథను తెరకెక్కించే బాధ్యతను జంధ్యాలకు అప్పగించారు. ఆ సినిమానే 'శ్రీవారికి ప్రేమలేఖ'. ఈ చిత్రం 1984 మార్చిలో ప్రేక్షకుల ముందుకొచ్చి మెప్పు పొందింది. కథలనేవి కల్పనల్లోంచి కాదు.. జీవితాల్లోంచి పుడతాయని ఉషాకిరణ్ మూవీస్ నిరూపించింది. అందుకు ఉదాహరణెళి ఈ సంస్థ నుంచి వచ్చిన నాలుగో చిత్రం 'మయూరి'. ఒక హిందీ పత్రికలో వచ్చిన వార్తను సినిమాగా మలిచి జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారు. ప్రమాదంలో కాలును పోగొట్టుకొని, కృత్రిమ పాదంతో నాట్యంలో రాణించిన సుధా చంద్రన్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించారు. ఆ పాత్రలో సుధా చంద్రన్నే నటించారు. స్ఫూర్తివంతమైన ఆ చిత్రం వచ్చి రెండున్నర దశాబ్దాలు దాటిపోయినా ఉషాకిరణ్ మూవీస్ అనగానే 'మయూరి' తప్పకుండా గుర్తుకొస్తుంది. సినిమా అంటే రెండున్నర గంటలపాటు ఊహాలోకంలో విహరింపజేయడం మాత్రమే కాదని నిరూపించిన చిత్రమిది. మౌనపోరాటం – యథార్థ సంఘటనలను తెరకెక్కించడంలో ఉషాకిరణ్ మూవీస్ కి ఓ ప్రత్యేకత ఉంది. ఒడిశాలో జరిగిన సంఘటన ఆధారంగా 'మౌన పోరాటం' చిత్రాన్ని నిర్మించారు. మగాడి చేతిలో మోసపోయిన ఓ వనిత పోరాటాన్ని ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారు. 1989లో విడుదలైన ఆ చిత్రం ఎందరినో ఆలోచింపచేసింది.ప్రతిఘటన – ఉషాకిరణ్ మూవీస్ సంస్థ ఏనాడూ కథానాయికనుగానీ, ఏ స్త్రీ పాత్రనుగానీ బలహీనంగా చూపించలేదు. ఆ పాత్రకు ఔచిత్యం, మనో ధైర్యం ఉండేలా తీర్చిదిద్దారు. ఇందుకు 'ప్రతిఘటన' తార్కాణం. సంఘ విద్రోహులతో పోరాడే తెగువ ఉన్న ఓ వనిత గాథను ఆవిష్కరించిన విధానం ప్రేక్షకుల మదిలో చెరిగిపోకుండా ఉంది. ఆ చిత్రంలోని 'ఈ దుర్యోధన...' పాటను ఎవరైనా మరువగలరా? ఆ పాటలోని సాహిత్యాన్ని ఆమోదించేందుకు ముందుగా నిర్మాతకు సంకల్ప బలం కావాలి. అది రామోజీరావుకు ఉంది కాబట్టే రచయిత వేటూరి రాయగలిగారు... దర్శకుడు టి. కృష్ణ అంతే శక్తిమంతంగా చిత్రించగలిగారు.క్రీడా కారిణి అశ్విని నాచప్పను కెమెరా ముందుకు తీసుకొచ్చింది కూడా ఈ సంస్థే.



క్రీడా నేపథ్యంలో స్ఫూర్తిదాయక చిత్రాన్ని నిర్మించాలన్న ఆలోచన నుంచి రూపుదిద్దుకున్నదే 'అశ్విని' కథ. ఆ పాత్రకు నిజ జీవితంలో క్రీడాకారిణి అయితే బాగుంటుందన్న ఆలోచనతోనే అశ్విని నాచప్పను ఎంచుకున్నారు. క్రీడలకే పరిమితమైన ఆమె.. కథ నచ్చడంతోపాటు, ఉషాకిరణ్ మూవీస్ విశిష్టతను తెలుసుకుని నటించేందుకు పచ్చజెండా ఊపారు. ఇలా చెబుతూ వెళ్తే ప్రతి చిత్రం వెనక ఓ బలమైన నేపథ్యం, ఓ సంకల్పం ఉంటాయి. 'తేజ', 'మనసు మమత', 'అమ్మ', 'జడ్జిమెంట్', 'పీపుల్స్ ఎన్ కౌంటర్'... అన్నీ నాటి సామాజిక పరిస్థితులకు దర్పణం పట్టినవే. 'చిత్రం', 'నువ్వే కావాలి', 'ఆనందం' వంటి ఘనవిజయాలున్నాయి. 'నచ్చావులే', 'బెట్టింగ్ బంగా ర్రాజు', 'నువ్విలా' లాంటి ప్రేక్షకులను ఉల్లాసపరిచే చిత్రాలు వచ్చాయి. 'నువ్వే కావాలి' సాధించిన వసూళ్లూ, సృష్టించిన రికార్డులూ ఆ ఏడాది ఏ మాస్ హీరోకీ తీసిపోనివే. చిన్న చిత్రాల రూపకర్తలకు ధైర్యాన్నిచ్చినవే. కొత్త ట్రెండ్ సృష్టించినవే. కేవలం తెలుగు చిత్రాలకే ఉషాకిరణ్ మూవీస్ పరిమితం కాలేదు. 'నాచే మయూరి', 'ప్రతిఘాత్', చిత్రాలతో బాలీవుడ్‌లోనూ జయకేతనం ఎగరేసింది. కన్నడ, తమిళ, మరాఠీ, ఆంగ్ల భాషల్లో ఇప్పటి వరకూ 87 చిత్రాలు నిర్మించిందీ సంస్థ. తొలి చిత్రం 'శ్రీవారికి ప్రేమలేఖ' నుంచే ప్రేక్షకుల మెప్పుతో పాటు ప్రభుత్వ పురస్కారాలూ వరించాయి. 'కాంచనగంగ', 'మయూరి', 'ప్రతిఘటన', 'తేజ', 'మౌనపోరాటం' లాంటి చిత్రాలకు నంది అవార్డులు దక్కాయి. 'మయూరి'లో నటించిన సుధాచంద్రన్‌కు ఏకంగా జాతీయస్థాయిలో ప్రత్యేక పురస్కారం లభించింది. 'నువ్వే కావాలి' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయస్థాయి అవార్డు అందుకుంది. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా ప్రేక్షకులకు చేరువైన నటీనటులు ఎందరో ఉన్నారు. ప్రతిభ ఉంటే చాలు అవకాశమిచ్చి ప్రోత్సహించారు. శ్రీకాంత్, వినోద్‌కుమార్, చరణ్ రాజ్, యమున, వరుణ్ రాజ్, ఎన్టీఆర్, ఉదయ్ కిరణ్, ఇలా ఎందరో నటులు ఈ సంస్థ ద్వారానే చిత్రసీమకు పరిచయమయ్యారు.

# రాములు కన్నీరు పెట్టిస్తున్నడు



'మల్లేశం' చిత్రంతో సక్సెస్‌ఫుల్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టారు నటుడు ఆనంద చక్రపాణి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన ముద్రతో రాణిస్తున్న ఆయన.. ఇటీవల విడుదలైన 'రాజు యాదవ్' చిత్రంలో ట్యాక్సీ డ్రైవర్ రాములుగా కీలక పాత్ర పోషించారు. ఆ పాత్రకు విమర్శకుల ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆనంద చక్రపాణి 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్న సంగతులు..కొడుకు భవిష్యత్తు కోసం తపిస్తూ, అతను అప్రయోజకుడైపోతున్నాడని సంఘర్షణ పడే తండ్రిగా 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రను దర్శకుడు అద్భుతంగా తీర్చిదిద్దాడు. కథ చెప్పినప్పుడు సాధారణంగా అనిపించినా..సెట్స్‌మీదకు వెళ్లిన తర్వాత నా పాత్రలో ఎంతటి బలమైన ఉద్వేగాలు ఉన్నాయో అర్థమైందిఈ పాత్రలో నేను పరకాయ ప్రవేశం చేశాను. షూటింగ్ సమయంలో ఓ రకమైన ట్రాన్స్‌లోకి వెళ్లిన,ావన కలిగింది. ముఖ్యంగా కొడుకు చావు ఘట్టంలో రాములు ప్రదర్శించిన నటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఆ సన్నివేశాల్లో తాము ఏడుపును ఆపుకోలేకపోయామని చాలా మంది నాతో అన్నారు. ప్రీవ్యూ చూసినప్పుడు నేను కూడా ఏడ్చాను.

# మ్యాసీవ్ మట్కా

యువహీరో వరుణ్‌తేజ్ నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా'. 'పలాస' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కరుణకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. రజనీ తాళ్లూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. హై బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 19 నుంచి మొదలుకానుంది. ఇందుకోసం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో మ్యాసీవ్ సెట్‌ను మేకర్స్ నిర్మించారు. నటుడిగా వరుణ్ కెరీర్‌లో ఈ సినిమా ఓ చాలెంజింగ్ మూవీ ఇదని, ఇందులో ఆయన నాలుగు డిఫరెంట్ గెటప్పుల్లో కనిపించనున్నారని మేకర్స్ తెలిపారు.



Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com